"ఆ క్షణంలో ఆ తండ్రి బాధాకరమైన నిర్ణయం తీసుకున్నాడు. ఆయన రెండో తాటిమట్టని మిత్రుడికి ఇచ్చి కొడుకుతో 'భయపడక. నీ వాళ్ళకేం కాదు. వాళ్ళ పోషణ నేను చూసుకుంటాను' అన్నాడు. వారిద్దరూ ఆ మట్టలతో సముద్రంలోకి దూకారు. ఓ పెద్ద అల రావడం, అది ఆ పడవని ముంచెత్తడం, నీళ్ళ మీద తేలుతున్న తండ్రి, మిత్రుడు చూసారు. సముద్రంలో మునిగి పోయిన కొడుకు శవమైనా లభ్యం కాలేదు."

ఫాదర్ అందరివంకా తేరిపార చూసి తను చెప్పేది ముగించాడు,

"నిస్వార్థతకి ఈ నిజ సంఘటన గొప్ప ఉదాహరణ. నిస్వార్థంగా ఉండేవాళ్ళనే జీసస్ అందరి కన్నా ఎక్కువగా ప్రేమిస్తాడు."

చర్చిలోంచి అంతా బయటికి వచ్చాక చాలామంది ఫాదర్ చెప్పిన దాని మీద చర్చించుకోసాగారు.

"అది కథే అయిఉండాలి తప్ప నిజ జీవితంలో జరిగిందంటే నమ్మబుద్ధి కావడం లేదు. ఏ తండ్రీ తన కొడుకుని రక్షించకుండా కొడుకు మిత్రుడిని రక్షించడు."

వారి మాటలు విన్న, ఆ ఫాదర్‌ని పరిచయం చేసిన ఆయన బాల్య మిత్రుడు వారితో చెప్పాడు.

"అది నిజంగా జరిగిన కథే. అలా రక్షింపబడ్డ ఆ మిత్రుడే ఈ ఫాదర్. ఆ సంఘటన తర్వాత అతను తన సంసారాన్ని త్యజించి ఫాదర్‌గా మారాడు."

## 61. భావం ప్రధానం

ఓ రోజు కాశీ విశ్వనాథుడ్ని పార్వతి అడిగింది.

"స్వామీ! గంగానదిలో స్నానంచేస్తే సర్వ పాపాలు పోతాయంటారే? మరి నిత్యం లక్షలాదిమంది గంగా స్నానం చేస్తున్నారు కదా. మరి వీరంతా స్వర్గానికి చేరడంలేదే?"

"ఆ భావంతో చేస్తేనే తగిన ఫలితం వస్తుంది."

పార్వతికి ఇంకాస్త అర్ధమయ్యేలా సమాధానం చెప్పాలనుకున్నాడు శివుడు. దాంతో శివుడు వృద్ధరోగిగా, పార్వతి అతని భార్యగా మారి గంగానది ఒడ్డుకి చేరుకున్నారు. శివుడు మరణించినవాడిలా కదలకుండా పడుకుంటే, పార్వతి పెద్దగా ఏడుస్తూ, గంగా స్నానానికి వచ్చిన వారితో ఇలా చెప్పసాగింది.

"నా పెనిమిటి మరణించాడు. ఆయన బ్రతికుండగా ఒక్క పుణ్యం చేయకపోగా అన్నీ పాపాలే చేసాడు. ఆయన్ని స్వర్గానికి పంపాలన్నది నా కోరిక. ఇవాళ సూర్యాస్థమయంలోగా ఆయన పాపాలని స్వీకరిస్తే ఆయన స్వర్గానికి చేరుకుంటాడు. మీలో ఎవరయినా సరే పుణ్యాత్ములు ఈ సహాయం చేసిపెట్టవలసిందిగా అర్థిస్తున్నాను."

అది విన్నవారెవరూ పార్వతి కోరికని తీర్చడానికి ముందుకు రాలేదు.

'ఆ వ్యభిచారి పాపాన్ని తీసుకోమంటావా?' అని కొందరు ఆమెని నిందించారు కూడా.

గంగాస్నానం చేసి కాశీవిశ్వేశ్వరుడ్ని సందర్శించుకోడానికి దూరప్రాంతం నించి వచ్చిన ఒకతను పార్వతి రోదన విని, సంగతేమిటని అడిగాడు. పార్వతి తన కోరికని వివరించింది. వెంటనే అతను ఆ శవం పక్కన కూర్చుని, దాని తలమీద తన చేతినుంచి చెప్పాడు.

"ఈ పవిత్ర గంగానది సాక్షిగా నేను నీ భర్త పాపాలన్నిటినీ స్వీకరిస్తున్నాను. అతనికి కాశీపతి స్వర్గ ప్రాప్తి కలిగించు గాక!"

"నీకేమైనా మతి పోయిందా? చచ్చినతను పొందాల్సిన నరకబాధలు నువ్వనుభవిస్తావా?" అది విన్న చుట్టుపక్కల వారు అతన్ని అడిగారు.

అందుకతను చిన్నగా నవ్వి, వెళ్ళి గంగలో మూడు సార్లు మునిగివచ్చి వాళ్ళతో చెప్పాడు.

"గంగా స్నానం చేస్తే పాపాలన్నీ పోతాయనే కదా మనం ఇన్ని వ్యయ ప్రయాసలని భరించి ఇంతదూరం వచ్చి గంగాస్నానం చేసేది. ఇప్పుడు నాకు పాపం ఎక్కడుంది?"

అంతమంది నిత్యం గంగా స్నానం చేస్తున్నా, వాళ్ళంతా ఎందుకు స్వర్గానికి చేరుకోవడం లేదో, ఏ భావంతో గంగాస్నానం చేయాలో అప్పుడు పార్వతికి అర్థమైంది.

## 62. దైవాన్ని మోసం చేయలేవు

ఒకతను సముద్రయానం చేస్తూంటే అకస్మాత్తుగా తుఫాను చెలరేగింది. అతను ప్రాణభయంతో ఆపద మొక్కుల వాడైన వెంకటేశ్వరుడికి ఇలా మొక్కుకున్నాడు.

"స్వామీ! నేనీ కష్టంలోంచి నీ దయవల్ల బయట పడితే మా ఇల్లు అమ్మేసి, ఆ వచ్చిన పైకం మొత్తం నీ హుండీలో వేస్తాను."

వెంటనే అతనికి ఆకాశవాణి ఇలా వినిపించింది.

"అలాగే. నీ మొక్కు తప్పక తీర్చు."

మరుక్షణం తుఫాను ఆగిపోయింది. బ్రతికి బయట పడ్డ అతను ఇంటికి చేరాడు. అయితే అతనికి ఇల్లు అమ్మి ఆ డబ్బు తిరుమల హుండీలో వేయబుద్ధి కాలేదు. అందుకతను దేవుడ్ని మోసం చేసే ఓ పథకం ఆలోచించాడు. తన బావమరిదిని పిలిచి జరిగింది చెప్పాడు.

"మనం తెలివిగా వ్యవహరించాల్సిన సమయం ఇది. నా ఇంటి ఖరీదు పది లక్షల రూపాయలు చేస్తుంది. నేను నా ఇంటిని నీకు వెయ్యి రూపాయలకి అమ్ముతాను. నాకు నష్టం రాకుండా నా పెంపుడు కుక్కని నీకు తొమ్మిది లక్షల తొంభైతొమ్మిది వేల రూపాయలకి అమ్ముతాను. నువ్వా విధంగా కొను. తర్వాత నా ఇంటిని నాకు తిరిగి వెయ్యికి అమ్మేయి."